నీట నానుతున్న నారుమడులు

- పొలాల్లో నిలిచిపోయిన ముంపు నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు


భారీ వర్షాలకు కాజులూరు మండలం మొగలిపాలెంలో నీట మునిగిన వెదజల్లిన వరిపైరు


తిప్పరాజుపాలెంలో నారుమడిలో చేరిన వర్షపు నీటిని గుల్ల సహాయంతో బయటకు తోడుతున్న రైతు

కాజులూరు: ఖరీఫ్ సాగు ప్రారంభం నుంచీ ఈ ఏడాది డెల్టా ప్రాంత రైతులను వర్షాలు వెంటాడుతున్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో మెజారిటీ రైతులు ఇప్పటికే వరినాట్లు, వెదచల్లడం పూర్తి చేశారు. మరికొందరు రైతులు నారుమడులు చల్లుకున్నారు. దమ్ము చేసిన పొలంలో రైతులు నానబెట్టిన విత్తనాలు చల్లి పొలంలో నీరు తీసిన రెండురోజులు ఆర నిచ్చి మళ్లీ నీటితడి పెడతారు. తడితడిగా ఉండే బురద పదునులో వరి మొక్క మొలకెత్తుతుంది. అయితే వారం, పది రోజులుగా రోజూ ఏదో ఒక సమయంలో చెదురుమదురుగానూ, భారీగానూ వర్షాలు పడుతూనే ఉన్నాయి. దాంతో లేత వరినాట్లు, నారుమడులు, వెదచల్లిన పొలాలు ముంపులో నానుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో నియోజకవర్గంలోని రామచంద్రపురం మండలంలో 15,300 ఎకరాల్లోనూ, కాజులూరు మండలంలోను 18,200 ఎకరాల్లోనూ, కె.గంగవరం మండలంలో 17,500 ఎకరాల్లోనూ, మండపేట నియోజకవర్గంలోని మండపేట మండలంలో 16,200 ఎకరాల్లోనూ, రాయవరం మండలంలో 14,640 ఎకరాల్లోనూ, కపిలేశ్వరపురం మండలంలోని 15,760 ఎకరాల్లోనూ రైతులు వరిసాగు చేపట్టారు. ఇందులో సగటున మండపేట నియోజకవర్గంలోని 50 శాతం రైతులు వెదచల్లికలు పూర్తి చేసుకోగా, మరో 30 శాతం రైతులు నారుమడులు చల్లుకున్నారు. ఇక రామచంద్రపురం నియోజకవర్గంలో 60 శాతం వెదచల్లికలు పూర్తి చేసుకోగా 20 శాతం పొలాల్లో రైతులు నారుమడులు వేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని చాలా గ్రామాలు టైలాండ్ ఏరియా పరిధిలోనివి. స్థానికంగా కురిసే వర్షాలకు తోడు డ్రెయిన్లు, పంట కాలువల ద్వారా ఎగువ నుంచి వస్తున్న వరదనీరు ఈ గ్రామాల్లోని పంటలను ముంచెత్తుతోంది. ఈ ముంపు వల్ల నారుమడులు, వెదచల్లిన పొలాల్లో విత్తనాలు మొలకెత్తడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజూ ఏదో ఒక సమయంలో వర్షం పడుతూండడంతో లేత వరినాట్లు నీట మునిగిపోయాయి. పొలాల్లోని వర్షపు నీరు ఎప్పటికప్పుడు దిగువకు వెళ్లక పోతే మొలకెత్తిన నారు కూడా దెబ్బ తింటుందని రైతులు చెబుతున్నారు. నారుమడి సక్రమంగా మొలవకపోతే వరినారు కొరత ఏర్పడు తుందంటున్నారు. వెదచల్లిన పొలాల్లో మొలక శాతం తగ్గిపోతే మధ్యమధ్యలో రైతులు నాట్లు వేసుకోవలసి వస్తుంది. మునిగిపోయిన నారుమళ్లలో నుంచి ముంపు నీటిని రైతులు ప్రస్తుతం ఆయిల్ ఇంజిన్లు, గుల్ల సహాయంతో బయటకి తోడుకుంటున్నారు.

మళ్లీ నారు జల్లుకోవాల్సిందే



వర్షాలకు వరినారుమడుల్లోని నీరు బయటకు వెళ్లక పోవడంతో నారుకు నష్టం వాటిల్లుతుంది. వరి విత్తనం చల్లిన రెండు, మూడు రోజుల వయసులో మూడు రోజులకన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గిపోతుంది. కొత్తగా చల్లిన విత్తనాలు మొలకెత్తకపోగా, మొలిచిన మొక్క రోజుల తరబడి నీట మునిగి ఉండిపోతే కుళ్లిపోతుంది.

– పోలినాటి సూర్యచంద్రం, రైతు శలపాక

డ్రెయిన్లలో పూడికలు తీయించాలి



మాది టైలాండ్ ఏరియా కావడంతో స్థానికంగా కురిసే వర్షాలకు తోడు ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీరు ఇక్కడ పంటలను ముంచెత్తుతోంది. డ్రెయిన్లు పూడుకుపోవడంతో పొలాల్లో చేరిన వరద నీరు రోజుల తరబడి నిలిచిపోయి పంటకు నష్టాన్ని కలగజేస్తోంది. అధికారులు స్పందించి డ్రెయిన్లలో పూడికలు తీయించాలి.

– సువ్వారి గోవిందు, రైతు తర్లంపూడి

నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వరి మొక్క కూడా శ్వాసక్రియ నిర్వహిస్తుంది. మొక్క పూర్తిగా నీటిలో మునిగిపోతే కిరణజన్య సంయోగక్రియ, శ్వాసక్రియ జరగక నష్టం వాటిల్లుతుంది. విత్తనాలు చల్లాక ఐదు రోజులకు మించి పొలంలో నీరు నిలిచిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకూ వరద నీరు తొలగించి ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున చల్లుకోవాలి. వర్షాలకు నారుమడులు తెగుళ్ల బారిన పడకుండా నీరు తగ్గి మొక్క నిలదొక్కుకున్నాక లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున కార్బండైజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం+మాంకోజెబ్ కలిసిన మిశ్రమాన్ని పంటపై చల్లుకోవాలి.

– వి అశోక్, ఏవో, కాజులూరు

రెండో రోజూ.. అదే హోరు..

కపిలేశ్వరపురం: అల్పపీడనం ప్రభావంతో గురువారం మండలంలోని గ్రామాల్లో జన జీవనం స్తంభించింది. అదే పరిస్థితి శుక్రవారం కూడా కొనసాగింది. మండలంలోని 19 గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఏకధాటిగా వర్షం కురిసింది. వర్షానికి తోడు బలమైన గాలులు వీయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అంగర, టేకి తదతర గ్రామాల్లోని ప్రైవేటు పాఠశాలలు మధ్యాహ్నం నుంచి తరగతులను రద్దు చేసి విద్యార్థులను ఇంటికి పంపేశారు. మాచర –కోరుమిల్లి ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిపై చర్చి వద్ద చెట్టు నేలకొరిగింది. పంచాయతీ అధికారులు స్పందించి జేసీబీ సాయంతో దానిని తొలగించారు. కపిలేశ్వరపురం, అంగర, టేకి, వాకతిప్ప, నేలటూరు, వల్లూరు తదితర గ్రామాల్లో వర్షపు నీరు రహదారులపై నిలచిపోయింది. దీంతో మురుగు డ్రైన్లు పూడుకుపోయాయి. పంచాయతీ కార్యదర్శులు స్పందించి సిబ్బందితో బాటలు వేసి నీరును బయటకు తొలగించారు. చిరు వ్యాపారాలు మూతపడ్డాయి.


మాచర ప్రధాన రహదారిపై ఒరిగిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం


కపిలేశ్వరపురంలో నీరు దిగువకు పోయేందుకు బాట తీస్తున్న పంచాయతీ సిబ్బంది


కోటిపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


హసన్‌బాదలో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

ఎడతెరిపి లేని వర్షం

కె.గంగవరం: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి చినుకుచినుకుగా కురిసిన వర్షం సాయంత్రానికి జోరందుకుంది. వర్షం ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లోని పల్లప్రాంతాలు నీటి మునిగాయి. కె.గంగవరం మండలంలోని ప్రధాన కాలువలు వర్షపునీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోజంతా వర్షం పడడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే ఆలస్యం చేసిన రైతులు వర్షం పడుతున్న కూలీల సహాయంతో నాట్లు వేశారు. మండలంలోని ప్రధాన కాలువలు, చెరువులు వర్షపు నీరుతో కళకళలాడుతున్నాయి. యండగండిలోని టేకి డ్రైన్‌లో భారీగా గుర్రపుడెక్క కొట్టుకురావడంతో వర్షపు నీరు ముందుకు కదలడం లేదు. పొలాల నుంచి డ్రైన్‌కు వస్తున్న వర్షపు నీరు వెళ్లేందుకు గుర్రపుడెక్క అడ్డుపడుతుంది. ఈ గుర్రపుడెక్కను తొలగించకపోతే పొలాల్లో ఉన్న వర్షపు నీరు బయటకి వెళ్లే దారి లేక ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

నిలిచిపోయిన పంటు ప్రయాణం

గోదావరికి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో రెవెన్యూ అధికారులు పంటు ప్రయాణాన్ని ఆపేశారు. ప్రస్తుతం వరద గోదావరి కోటిపల్లి రేవులో పుష్కర ఘాట్ మెట్ల వరకు ప్రవహిస్తుంది. గంట గంటకు ఉధృతి పెరుగుతుందని రాత్రికి మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

చెరువులను తలపిస్తున్న పంట చేలు

రామచంద్రపురం రూరల్: విడవకుండా కురుస్తున్న వర్షాలకు పంట చేలు మునిగిపోయి చెరువులను తలపిస్తున్నాయి. నాట్లు వేసిన పంట పొలాలు కొంతవరకు పరిస్థితి ఆశాజనకంగా ఉన్నా.. వెదజల్లిన పంట పొలాల్లో మాత్రం రైతులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అటు వెదజల్లినా, నారు పోసినా పంట పొలాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు చేస్తున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ హాజరయ్యారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాఖల వారీగా ప్రగతి నివేదికను సభ్యులకు వివరించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్, వెలుగు, ఎంజీఎన్ఆర్‌జీఎస్, వైద్య, విద్య తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు నివేదిక చదివి సభలో వినిపించారు. అయితే ఆయా శాఖలకు చెందిన సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. పలువురు ఎంపీటీసీలు సర్పంచ్‌లు మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీల వద్ద రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. కుడుపూరు సర్పంచ్ పిల్లి రాంబాబు మాట్లాడుతూ కుడుపూరు శివారు గ్రామానికి రహదారి లేదని వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. కూళ్ల ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్ మల్లవరంలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరిందని నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మించాలని కోరారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంలో పనిచేయాలి

మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో భాగస్వాములై ప్రజా సమస్యలను పరిష్కరించాలని రాజ్యసభ సభ్యుడు బోస్ సూచించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ఏదైనా సరే ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి వారిచే కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, శ్మశానాలు, ఖాళీ స్థలాల్లో చెట్లు నాటాలని ఎంజీఎన్ఆర్‌జీ ఏపీఎంకు సూచించారు. చెట్లు నాటడం కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకరించాలని కోరారు. వరిసాగు విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని ఇటువంటి సమయంలో రైతులకు అండగా అధికారులు ఉండాలని కోరారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మధుబాల, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు తపాలా ఉద్యోగుల ధర్నా


నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

మండపేట: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తపాలా ఉద్యోగులు శుక్రవారం స్థానిక మెయిన్ రోడ్డులోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు కె. ఈశ్వరరావు, కొండపల్లి సూర్యనారాయణ మాట్లాడుతూ 8వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న డీఏ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను గ్రూప్ డి ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. చనిపోయిన ఉద్యోగుల పిల్లలందరికీ ఐదు శాతం సీలింగ్ లేకుండా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఎన్ఎఫ్‌పీ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్) కేంద్ర సంఘం పిలుపు మేరకు భోజన విరామ సమయంలో నిరసన తెలిపామన్నారు. కార్యక్రమంలో జి. వెంకట్రావు, జి.శివయ్య, సీహెచ్ శ్రీనివాస్, పేపకాయల ప్రసాద్, గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు ఎండీఎం షరీఫ్, పాలెపు దుర్గయ్య, కె.పవన్ సాయి, పెన్షనర్ల ఉద్యోగుల సంఘం నాయకుడు టి. పుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పంటు ప్రయాణం

అయినవిల్లి: ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద నీటి మట్టం పెరగడంతో అధికారులు ముక్తేశ్వరం-కోటిపల్లిరేవు పంటు ప్రయాణాన్ని శుక్రవారం నుంచి నిలిపివేశారు. వరద ఉధృతికి ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. దీంతో అధికారులు ముందుస్తు చర్యగా పంటు ప్రయాణం నిలిపివేశారు. వరద ఉధృతి తగ్గే వరకూ పంటుపై ప్రయాణాలు ఉండవని అధికారులు చెబుతున్నారు. వరదనీటి ప్రవాహానికి ముక్తేశ్వరం –కోటిపల్లిరేవులో ముక్తేశ్వరం వైపు వేసిన తాత్కాలిక రహదారి మునిగింది. వరద నీటి ఉధృతికి ఈ రహదారి పూర్తిగా కొట్టుకు పోయింది. ఇక్కడి రైతులు నాటు, ఇంజిన్ పడవల పై రాకపోకలు కొనసాగిస్తున్నారు. ముందస్తు చర్యగా పాడి పశువులను, వ్యవసాయ ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

అధికారులు అప్రమత్తమవ్వాలి


ముక్తేశ్వరం-అయినవిల్లిలంక కాజ్‌వేను సందర్శించిన జేసీ నూపుర్ అజయ్

అయినవిల్లి: ఎగువన కురుస్తున్న వర్షాలకు తోడు, బంగాళాఖాతంలో అధిక అల్పపీడనం ఏర్పడంతో కురుస్తున్న వర్షాలకు అధికారులు అప్రమత్తమవ్వాలని ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి అధిక నష్టాన్ని నివారించాలని జిల్లా జేసీ నూపుర్ అజయ్ అదేశించారు. శుక్రవారం ఆమె అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం-అయినవిల్లిలంక వద్ద ఎదురుబిడెం కాజ్‌వేను అధికారులతో కలసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ వరదల నేపథ్యంలో వరద ప్రభావిత గ్రామాలైన చింతనలంక, వీరవల్లిపాలెం, పొట్టిలంక, కొండుకుదురులంకలోని గున్నంమెరక, తొత్తరమూడిలోని కె.పెదలంక, మడుపల్లిలోని మడుపల్లిలంక గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఏ క్షణాన్నైనా వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని, అధిక నష్టం వాటిల్లక ముందు ప్రజలు వ్యవసాయ ఉత్పత్తులు, పశువులను మరే ఇతర వాటినైనా రక్షించుకోవాలన్నారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యగా పడవలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా శాఖ అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు అండగా నిలవాలన్నారు. తొలుత ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. వరద విపత్తుల నుంచి అధిక నష్టాన్ని ఎలా నివారించవచ్చు అనే అంశంపై చర్చించారు. అన్ని శాఖల సమన్వయంతో రెవెన్యూ, పంచాయతీశాఖ అధికారులు పనిచేయాలని అదేశాలు జారీ చేశారు. ఆమె స్థానిక తహసీల్దార్ ప్రమద్వర, ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన తాళ్లమ్మ తల్లి

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డి పాలెం గ్రామదేవత తాళ్లమ్మ తల్లి అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా ఆలయ కమిటీ ప్రెసిడెంట్ విద్యా సత్యనారాయణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ఆసాదులు అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

నేడు స్టూడెంట్ కిట్ల పంపిణీ

రామచంద్రపురం రూరల్: నేటి ఉదయం 9 గంటలకు రామచంద్రపురం పట్టణంలోని వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించే స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా వారు కోరారు.

జల్‌జీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యటన


క్షేత్ర పరిశీలనాంశాలను సేకరిస్తున్న జల్‌జీవన్ మిషన్ సెంట్రల్ టీం సభ్యులు

కపిలేశ్వరపురం: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో తాగునీరు సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇంటింటికీ కుళాయి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ఇప్పటికే పలు గ్రామాల్లో పనులను ప్రారంభించారు. కాగా మండలంలోని నాగులచెరువు పంచాయతీ పరిధిలో తాగునీరు సరఫరా తీరును విజయవాడ నుంచి వచ్చిన జల్‌జీవన్ మిషన్ సెంట్రల్ బృందం సభ్యులు పరిశీలించారు. గ్రామంలో తాగునీటి నాణ్యత తదితర అంశాలపై సభ్యులకు పంచాయతీ కార్యదర్శి కె. యశ్వంత్‌కుమార్ వివరించారు.

డిగ్రీ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం అందుకున్న డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులు

మండపేట: మారేడుబాకలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫస్టియర్ విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా రెండేసి జతల చొప్పున యూనిఫాం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడకు చెందిన డాక్టర్ ధరహాస వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలో చేరిన ఫస్టియర్ విద్యార్థులకు ఉచితంగా రెండేసి జతల యూనిఫాం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కళాశాల నిధులతోనే వాటిని పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె. శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్ నెహ్రూ నాయక్, సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

శరీరంపై మచ్చలొస్తే వైద్యుడిని సంప్రదించండి

కపిలేశ్వరపురం: శరీరంపై స్పర్శలేని మచ్చలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలని వాకతిప్ప పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని వాకతిప్ప, నాగులచెరువు తదితర గ్రామాల్లో కుష్ఠు వ్యాధి గ్రస్తుల గుర్తింపు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సర్వే చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై వైద్యాధికారి పి.చంద్రమౌళి, సీహెచ్.రాకేష్ చౌదరి ఆధ్వర్యంలో సర్వే సాగుతుంది.

గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే


వాకతిప్పలో రోలులో నీటిని తొలగింపజేస్తున్న వైద్య ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో ఫ్రైడే డ్రైడే పేరుతో ప్రత్యేక పారిశుధ్య చర్యలను చేపట్టారు. ఆయా పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు గ్రామ వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలోని పూడికను తొలగించారు. వాకతిప్ప గ్రామంలో అక్కడి పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు తదితర వైద్య ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నివాస స్థలంలోని రోళ్ల తదితర వస్తువుల్లో నిలిచిన నీరును పారబోయించారు. అంగర, అచ్యుతాపురం పీహెచ్‌సీల వైద్య ఆరోగ్య కార్యకర్తలు ఆసుపత్రుల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి పర్యటన చేపట్టారు.

తిరుమలకు పాదయాత్ర

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అల్లూరి రామకృష్ణ చౌదరి శుక్రవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మండపేట ఎమ్మెల్యేగా వేగుళ్ళ జోగేశ్వరరావు నాలుగోసారి ఎన్నికైతే తిరుమలకు కాలినడకన వస్తానని మొక్కుకున్నట్టు రామకృష్ణ చౌదరి తెలిపారు. యాత్రను ఎమ్మెల్యే వేగుళ్ళ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుత్సల శ్రీనివాస్, పువ్వల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

మండపేట: వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు మండలం నుంచి తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఈ మేరకు చర్యలు చేపడతామని తహసీల్దార్, ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఐదంరాజు, హౌసింగ్ ఏఈ దాస్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి(ద్వారపూడి) విళ్ల రమణారావు, పోలీస్, రెవెన్యూ, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

24 గంటలూ విధులకు ఆదేశం

కపిలేశ్వరపురం: గోదావరి వరద ఉధృతం అవుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గోదావరి తీర గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు 24 గంటలూ విధులను కేటాయిస్తూ ఎంపీడీఓ ఏవీవీఎస్ఆర్ఎస్ కొండలరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ అద్దంకివారిలంక, కేదారిలంక పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌వీవీ నరసింహారావు, కోరుమిల్లి కార్యదర్శి ఆర్ఎస్‌వీ కామేశ్వరరావు, మాచర కార్యదర్శి జి.చినబాబు, తాతపూడి కార్యదర్శి పలివెల మోహన్, కపిలేశ్వరపురం కార్యదర్శి కె.శివచక్రవర్తిలకు 24 గంటలు విధుల నిర్వహణకు ఆదేశించారు. గోదావరి వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించడంలో అలసత్వం లేకుండా విధులను నిర్వహించాలని ఆదేశించారు.

రైతన్నను నిండా ముంచిన వర్షం


మండలంలోని లొల్లలో నీట మునిగిన వరిపైరు

రాయవరం: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మండలంలో పలుచోట్ల నారు మడులు నీట మునిగాయి. లొల్ల, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో పల్లపు పొలాలు నీట మునిగాయి. డ్రైన్లు వేగంగా నీటిని లాగక పోవడంతో పొలాల్లో నీరు నిలిచిపోయింది. గ్రామాల్లో పలుచోట్ల రోడ్లపై ఉన్న గోతుల్లో నీళ్లు నిలిచిపోవడంతో ప్రయాణానికి అసౌకర్యంగా ఉంది. తుపాను ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకూ వర్షం కురుస్తూనే ఉంది. మరో రెండు రోజులు ముంపు ఇలానే కొనసాగితే నారు కుళ్లిపోయే దశకు చేరుకుంటుందని రైతులు వాపోతున్నారు. వరుణ దేవుడు కనికరించకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. నీటిలో మునిగి తేలియాడుతున్న వరి పంటను రక్షించుకునేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలన్నీ ఇన్నీ కావు. ఇప్పటికే నారుమడులు ఆలస్యం కాగా ముంపు బారిన పడిన నారు పాడైపోతే మళ్లీ తిరిగి నారుమ డులు పోసి నాట్లు వేయాలంటే దాళ్వాసాగుకు ఆటంకం కలుగుతుందని రైతులు వాపోతున్నారు.

'అన్నదాత సుఖీభవ' సొమ్ములు వెంటనే చెల్లించాలి


కాజులూరులో ధర్నా నిర్వహించి డీటీకి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

కాజులూరు: ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఇస్తామన్నా రూ.20 వేలు వెంటనే వారి బ్యాంక్ ఖాతాల్లోనికి జమ చేయాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు తదితరులు డిమాండ్ చేశారు. కాజులూరు మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం మండల గ్రామాలకు చెందిన కౌలు రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో రాజబాబు, ఈశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలో రైతులు తొలకరి సాగు పనులు నిర్వహిస్తున్నారని పెట్టుబడులకు సొమ్ములు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం 2019 చట్టాన్ని రద్దు చేసి 2011 చట్టాన్ని అమలు చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం మండల శాఖ అధ్యక్షుడు అల్లాడి నరసింహమూర్తి, రైతు సంఘాల నాయకులు నామా సత్యనారాయణ, అమలకంటి వెంకన్న, కోన తాతారావు, శాకా ఆంజనేయులు, తలాటం వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి రాము, యాళ్ళ చక్రం, సలాది వెంకన్న, చొల్లంగి వాడపల్లి, జుత్తుక కొండ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళ్తా


ఆక్వా రైతుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: ఆక్వా రైతుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తానని ఆక్వా రైతులు వ్యవసాయాన్ని నియమ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే చేయాలని ఆక్వా రైతులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలియజేశారు. నియోజకవర్గంలోని మూడు మండలాల ఆక్వా రైతుల సమావేశం పట్టణంలోని లయన్స్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సుభాష్ పాల్గొన్నారు. రైతులు సమస్యలను వివరిస్తూ మంత్రి సుభాష్‌కి వినతిపత్రాన్ని ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఆక్వా రైతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మత్స్యశాఖ అధికారులు మూడు మండలాలకు సంబంధించిన రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.